# ముత్యాలు

“ఎందుకు ఏడుస్తున్నావు? వివాహం చేసుకోబోతున్నావా? స్త్రీపైనా బాగుండిపోయేది? నీ అశ్రుబిందువులు నీ పాదాల దగ్గరవున్న నా మీదపడి చిందిపోయేవి! నీ వెవరవు?” అని అడిగింది పిచ్చుక.

“నేను.... బ్రతికివున్న రోజుల్లో....రాజాధిరాజును.... మహారాజును” అని ఎక్కెక్కి ఏడ్వటం మొదలు పెట్టిందా శిలావిగ్రహం.

“బ్రతికివున్న రోజుల్లో మహారాజు లందరూ, మరణించిం తరువాత యిట్లా ఏడుస్తూ కూచుంటారా?? యుద్ధంలో మరణించిన రాజులకు వీర స్వర్గం! మహారాజుగా మరణించిన వారికి ఘోర దుఃఖః!! అంతేనా?” అని అడిగిందా పిచ్చుక ఆశ్చర్యంతో.

“అవును!” కన్నీరు తుడుచుకొని మాట్లాడిందా విగ్రహం. “మహారాజులంటే ఏమనుకున్నావు? అంతఃపురంలో కాలం గడిపే అసూర్యం పశ్యలు....ఉదయం మిత్రులతో వుద్యానవనంలో షికారు, సాయంకాలం చల్లగాలిలో ప్రియురాండ్రతో వనవిహారం. వెన్నెల, రాత్రులలోసురాపానం, నృత్య విశేషాలూ.... జీవితమంతా నే నీ విధంగా గడిపాను. విషయ వాంఛలలో చిక్కి హృదయ దౌర్బల్యంచేత నేను రాజ్యాంగంలో ఏ మాత్రం జోక్యం కలిగించుకోకపోవటం వల్ల ప్రజలు నన్ను కన్న తండ్రిలా చూచుకునేవారు. దుర్బలులను పొగడటం, శక్తిమంతులను సహించలేకపోవటం వాళ్ళ స్వభావం. అందుకనే నేను మరణించిన తరువాత నా ప్రాణాలను ఈ శిలావిగ్రహంలోకి ఊది, నన్నీ ఉన్నత స్థానాన ప్రతిష్ఠించారు. ప్రపంచమును నిజస్థితిలో నే నిప్పుడు చూడగల్గుతున్నాను. అది అసహ్యామయం! ప్రజల కన్నీ కష్టాలే! వాటిని చూచిన కొద్దీ, పిచ్చుకా! నా హృదయం ఇనుముతో చేయబడ్డా తరుక్కుపోతోంది.

"నీ వేమి చూడగల్గుతున్నావు?" అని ప్రశ్నించిందా పిచ్చిక ఎగిరి ఆ శిలావిగ్రహం భుజంమీద వాలి, కూచొని.

"అదిగో దూరంగా ఆ వీధిలో ఒక పూరిల్లున్నది. అందులో ఒక యువకుడు సుష్కావయవాలతో, జీర్ణాంబరాలతో ప్రొద్దుపుచ్చుతున్నాడు. అతడు కవి, విమర్శకుడు, అతడు నటకుడు. అతడు కళకోసం ధనమును ఆర్జించుకొని సుఖపడే అవకాశాలను తన్నివేసి, దేశంకోసం అపద్ధతులు పనికిరావని నిరసించి, తనకలమునే నమ్ముకున్నాడు. కాని ఈ దరిద్రదేశం దుష్టులను తన అంకంలో చేర్చుకుంటుందిగాని, మేధావులను అర్థం చేసుకోకపోగా, సహించలేదు కూడాను. తినుటకు తిండి లేక అతని తేజోవంతములయిన నేత్రములు కుంచుకొని పోతున్నాయి. అతని విశాలమయిన ఫాలభాగము అప్పుడే ముడతలు పడిపోయింది.... నేడతను ఉదరపోషణార్థం ఒక పుస్తకం వ్రాస్తున్నాడు కాని దానిని పూర్తిచేయుటకు అతనిలో జవసత్వాలు లేవు....దీపములో చమురు లేదు.... చేతిలో చిల్లిగవ్వయినా లేదు.... చేయునది లేక అతడు నిరాశాపూరితుడై తలను చేతులలో ఇరికించుకొని విలపిస్తున్నాడు. "పిచ్చుకా! నా హృదయం నీరైపోతోంది. కాని నేను కదలలేను. నా కత్తిలోని ఈ ముత్యమును తీసుకొని పోయి అతని కివ్వు—పుణ్యముంటుంది?"

"వారంరోజుల క్రితమే నా మిత్రులందరూ ఈజిప్టు దేశం వెళ్ళారు. వాళ్ళు నాకోసం కన్నులు బండిచక్రాలంత చేసుకొని ఎదురు చూస్తూ వుంటారు. నైలునదిలో ఈదులాడి పుప్పొడిలో దొర్లిదొర్లి, తామరపూలతో సరసాలాడుతూ సుఖంగా కాలంగడుపుతూ వుంటారు. నేనక్కడికి పోవాలి.... వెంటనే పోవాలి" అన్నది పిచ్చుక.

"పిచ్చుకా, పిచ్చుకా!! నేను చెప్పినట్లు చెయ్యి. అతడు క్షుద్బాధను ఓర్చుకోలేక మూర్ఛపోయాడు."

"సరే, నేటికి నా ప్రయాణం ఆగిపోయింది. ఈరాత్రి నీతో వుండి నీవు చెప్పినట్లు చేస్తాను."

శిలావిగ్రహం సంతోషించింది....చల్లని చూపులతో తన కృతజ్ఞతను వెల్లడించింది.

పిచ్చుక ఆ ముత్యమును ముక్కుతో కరచుకొని పోయింది. ప్రేమికీ ప్రేమికులు తొంగిచూశారు. ఈ బాహ్య ప్రపంచాన్నే మరచి పోయిన స్వార్థపరులువారు. వారిద్దరి ప్రేమ మధ్య ఎందరు జీవులు హత మౌతున్నారో ఆలోచించుకోరు. సుఖం కొరకు ప్రేమిస్తారు; ఆ సుఖమును పొందుటకు ఎట్టికష్టములనయినా ఢీకొంటారు; ఎందరినయినా నాశనం చేస్తారు. ధనార్జనాపరులూ ఇంతే. కాని "వారిది పవిత్ర ప్రేమ, వీరిది స్వార్థం" అంటుంది ప్రపంచం.

పిచ్చుక వీరినంతయినా చూడకుండా పోయింది! పగలు సంపాదించు కున్న ధనమును భేదాభిప్రాయాలుపడి, భాగించుకో లేక పోట్లాడుకునే వర్తకులను తొంగిచూచి పోయింది రాజసౌధాలను దాటిపోయింది. దేవాల యాల మీదుగా ఎగిరిపోయింది. చివరికి ఆ కవిగృహం ప్రవేశించింది. సొమ్మసిల్లి పడివున్న అతని ప్రక్కనే ముత్యమునుంచి, నెమ్మదిగా తన రెక్కలతో అతనికి విసిరి ఎగిరిపోయింది.

అతడు సేదదీరి ఆ ముత్యమును చూచి "జ్ఞాన సూర్యుడుదయిస్తు న్నాడు. అప్పటికప్పుడే అతని కిరణములు తమ పనిని నిర్వర్తిస్తున్నాయి. ఇంక ఈ అంధకారం ఎంతసేపో ఉండదు. ఆహా!" అని సంతోషించి, ద్విగుణీకృతోత్సాహంతో పుస్తకమును పూర్తిజేయ పూనుకున్నాడు.

* * * * *

మరుదిన మా పిచ్చుక ఊరు పట్టుకొని తిరిగింది. కనపించిన ప్రతి నదిలోనూ స్నానంచేసింది? చింతచెట్టు చిటారు కొమ్మన కూర్చుని తనలో తాను తలతో లయవేస్తూ పాడుకుంది. చూచిన వాళ్ళందరూ "భలే పిచ్చుక!" అన్నారు....

చంద్రోదయం కాగానే శిలావిగ్రహం దగ్గరకు వచ్చి, "నేనిప్పుడు ఈజిప్టు పోతున్నాను. ఏమయినా కబుర్లున్నాయా" అని అడిగింది.

"పిచ్చుకా! ఈ రాత్రికి కూడా ఉండు" అని ప్రార్థించిందా విగ్రహం.

"వీల్లేదు."

"అదుగో-ఆ యింట్లో ఒకస్త్రీ నిద్రాహారాలు లేకుండా విలపిస్తోంది. "కొడుకా!" అని అన్న ఆమె నోటికి మాత పడలేదు. ఆమె ఏకైక పుత్రుడు సోషలిష్టు అగుటవల్ల ప్రభుత్వమునకూ, ప్రజలకూ పనిరాకుండా పోయాడు. ప్రభుత్వము అతని చర్యలు ఉపద్రవములైనవని భయపడి అతనికి కఠిన శిక్ష విధించింది. ప్రజలు అతని సిద్ధాంతములు అపాయకరములని నిరసించి అతనినిపైకి రానీయకుండా అణగద్రొక్కారు. తన శరీరమును మాతృదేవికి అర్పించి, తన ప్రాణములను అరచేతిలో పెట్టుకొని దేశము కొరకు పాటుపడి ఆ వీరుడు నేడు క్షయవ్యాధితో బాధపడుతున్నాడు. మరి ఈ ప్రజలు అప్పటికప్పుడే అతనిని మరచిపోతున్నారు, "చేతులారా చేసుకొన్న దానికి అనుభవిస్తున్నాడు" అని చెప్పే వేదాంతులు కూడా బయలుదేరుతున్నారు. అతడు చేసిన త్యాగమునకు, దేశసేవకు అతని మాతృదేవిని పోషించు బాధ్యతను వహించు బుద్ధిమంతు లీ దేశంలో లేరు. ఆమె తినుటకు తిండిలేక, కట్టుటకు గుడ్డలేక కన్నపుత్రుని తలచుకొని రోదిస్తోంది...."

"నే నీ రాత్రి నీతో వుండి నీవు చెప్పిన పని చేస్తాను. కాక ఇక నీ దగ్గిర ముత్యాలు లేవే. ముత్యాలు లేనివాడు యితరుల కష్టములను చూచి మనోవ్యధపాలయి యేమి ప్రయోజనం?"

"పిచ్చుకా! నా నేత్రాలను ముత్యాలతో చేస్తా రీ మూర్ఖులు. అందులో ఒకదానిని తీసికొనిపోయి ఆమెకివ్వు."

"ఎంతమాట! ఎంతఘోరం! అంతపని నేను చెయ్యలేను. ఎన్నటికీ చెయ్యను" అన్నదా పిచ్చుక కంట తడిపెట్టుకొని.

"పిచ్చుకా, పిచ్చుకా, నేను చెప్పినట్లు చెయ్యి."

పిచ్చుక మాట్లాడకుండా ఆ విగ్రహంకన్ను ముక్కుతో పీకి, తీసుకొనిపోయి ఆమెకు యిచ్చి వచ్చింది. "నా కుమారుని స్వార్థ త్యాగమునకు మెచ్చి ఎవ్వరో పంపార"ని అనుకున్నదామె.

*   *   *   *   *

మరుదినమంతా పిచ్చుక పరధ్యానంగా తిరిగింది....ఆందోళన పడ్డది. చీకటి పడగానే శిలావిగ్రహం దగ్గరకు వచ్చి, "నీ దగ్గర శలవు దీసుకొనుటకు వచ్చా" నని చెప్పింది

"పిచ్చుకా, పిచ్చుకా, నాతో ఈ రాత్రికూడా ఉండవా?" అని కోరింది శిలావిగ్రహం.

"వీల్లేదు."

"అక్కడ ఒక యువతి కుమిలి కుమిలి ఏడుస్తోంది. మనసార బిగ్గరగా దుఃఖించే భాగ్యమునకు కూడా ఆమె నోచుకోలేదు. అకారణంగా ఆమెను భర్త వదలివేశాడు, అతడు ఇంకొకతెను వివాహమాడి కులుకుతున్నాడు. కాని సంఘం ఈమెను గుప్పెటలో ఇరికించుకొని పుణ్యం, స్వర్గం అనే ఆశలు గలిగించి నలిపి నలిపి బాధపెడుతోంది. ఆ సుకుమార హృదయం బాధకు తాళలేక అల్లడి తల్లడై పోతోంది భరించ వలసినవాడే వదలివేయటంవల్ల కన్నవారు కూడా ఆమెను నీచంగా చూస్తున్నారు. భావ కవులు ఆమె మీద పద్యాలు వ్రాసి పేరు గడించుకుంటున్నారు. వారు భావ కవులు కాదు.—స్వార్థపరులు. వారిలో ఎవ్వరూ ఆమెను కాపాడుటకు ప్రయత్నించరు. ఆమె అపూర్వ సౌందర్యం అరణ్యంలోని కుసుమమువలె, సముద్రంలోని ముత్యంవలె, ఊరికే పోతోంది. పిచ్చుకా! నేనిది భరించలేను. నా రెండో కన్ను తీసుకొనిపోయి ఆమెకివ్వు. ఆ ధనంతో ఎక్కడకయినా లేచిపోయి సుఖపడుతుందామె!"

"నేను చచ్చినా ఈపని చేయను. నీవు అంధుడవౌతావు."

"పిచ్చుకా! పిచ్చుకా! నేను చెప్పినట్లు చెయ్యి. అంధులే ధర్మాలు చేసేది! ఈ లోకమును ఒంటికంటితో తిలకించలేను."

ఆ పిచ్చుక అతని రెండోకంటిని ఆమెకిచ్చి వచ్చింది.

*   *   *   *   *

"ఇప్పుడు నీ బంధుడవు. నేను నిన్ను ఈ స్థితిలో వదలిపోలేను. కనుక యిక్కడే కాలక్షేపం చేస్తాను. నీకు కాలము గడచుటకు వినసొంపయిన కథలు చెబుతాను."

"పిచ్చుకా, నాకు కథలు వద్దు. నా రాజ్యమంతా చూచి అందరి ప్రజలనుభవించే కష్టములను నాకు వినిపించు. ఈ ప్రపంచంలో కష్టముల కన్నా వేరు కథలు లేవు."

ఆ పిచ్చుక పగలంతా ఊరూరూ తిరిగి తాను చూసిన విశేషములను రాత్రులు ఆ విగ్రహానికి చెప్పేది. కష్టంలో వున్నవారికి ఆ విగ్రహము తన శరీరంమీది బంగారమును ఒలిచి పిచ్చుకద్వారా పంపేది. కాని కొన్నాళ్ళకు ఆ విగ్రహం యొక్క బంగారు తొడుగు అయిపోయింది. మంచులో వుండలేకా; తిండిలేకో పిచ్చుక మరణావస్థకు వచ్చింది. ఒక రోజు విగ్రహంతో "రాజా, నేను పోతున్నాను" అన్నది.

"మంచిది పిచ్చుకా, ఈజిప్టు వెళ్ళు, నిన్ను నేను చాలా రోజులు ఆపాను. నా బంగారంతోపాటు నేనీ లోకంలో చేయగల పని అయిపోయింది. పిచ్చుకా! ఈజిప్టు వెళ్ళి నీ మిత్రులతో హాయిగా కాలం గడుపు!"

"ఈజిప్టేమి కర్మ! నేను పరలోకమునకే పోతున్నాను....కాని నేను నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను....కాని వెళ్ళబోయే ముందు ఒక్కసారి ముద్దుపెట్టుకోనివ్వు" అన్నది పిచ్చుక.

"పిచ్చుకా, పెదిలమీద ముద్దు పెట్టుకో!" అన్నాడు రాజు.

అలాగే ముద్దుపెట్టుకొని, ప్రాణములు వదలి, విగ్రహం పాదాల మీద పడింది పిచ్చుక. ఆ శిలా విగ్రహంలో ఏదో రెండుగా పగిలిన ధ్వని....దాని హృదయం బ్రద్దలయింది.

(ఆస్కార్ వైల్డు ఈ కథకు బిక్ష పెట్టాడు.)

—(0)—